క్లుప్తంగా

ఈనెల 18న విద్యార్థులకు సన్మానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 2023 టీఎస్ ఎంసెట్, నీట్, జేఈఈ, సివిల్స్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినీవిద్యార్థులకు అహోపా బ్యాంక్‌మెన్ చాప్టర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సన్మానించి బంగారు పతకాలను బహుకరిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ కన్వీనర్ టీఎల్‌వీరావు, డాక్టర్ కొత్త రామానందం, అధ్యక్షులు రమణయ్యలు తెలిపారు. ఈనెల 18న ఆదివారం రోజున హైదరాబాద్ కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు బంగారు పతకాలతో సత్కరిస్తున్నట్లు వివరించారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



ఏపీ పెన్షనర్లదారుల సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నలినిమోహన్ కుమార్, టీ.ఎం.బీ.బుచ్చిరాజులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎండలు అధికంగా ఉండటంతో గత వారం రోజుల నుంచి తాగునీటితో పాటు మజ్జిగను పంపిణీ చేస్తున్నామన్నారు. రోజూ సుమారు 400 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ జనార్దన్‌రావు, ఉపాధ్యక్షులు జే.వి.వి.జనార్దన్‌రావు, మస్తాన్ తదితరులున్నారు.

అమ్మవారి ఆలయ పనులు ప్రారంభం



అంబర్‌పేట: అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించి విశాలంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు గోల్నాక జైస్వాల్ గార్డెన్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపారు. కాలనీలో ఉన్న మైసమ్మ అమ్మవారి ఆలయ విస్తరణ పనులు ప్రారంభించారు. వచ్చే బోనాల పండుగ నాటికి అమ్మవారి ఆలయ పనులను పూర్తి చేస్తామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసన్నాంజనేయులు, యాదవరెడ్డి, సుధాకర్, శ్రీహరిచారి, ఇంద్రసేనాయాదవ్ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ ఉమ

కాచిగూడ: అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 33 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తహసీల్దార్ మల్లేష్, వీఆర్‌ఓ మధు, భీష్మ, భీమ్‌రాజ్, మధుయాదవ్, సూరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నోట్ బుక్స్ పంపిణీ

కాచిగూడ: సినీహీరో సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి వేడుకలను తెలంగాణ మహేష్ కృష్ణ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు శ్రీనివాస్‌రావు, ఎడ్ల నరేందర్‌రెడ్డిలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాచిగూడలో చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు పళ్లు, బ్రెడ్, బిస్కెట్లు, ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఉండే అనాథలకు దుప్పట్లను అందజేశారు. కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు అందరూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. రాజు, రమేష్, సుభాష్, వినోద్, నరేష్‌గౌడ్, లక్ష్మణ్, చారి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట పొగరాయుళ్లను కట్టడి చేయండి !

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పొగ మనిషి పాలిటేకాక పర్యావరణం పాలిట కూడా శత్రువేనని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. పోలీసులు, సంబంధిత అధికారులు ఆరుబయట పొగతాగే వారిపై ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని కోరారు. అధికారులు తీసుకునే చర్యలు పర్యావరణానికే కాకుండా ఆయా కుటుంబాలను రక్షించినట్లు అవుతుందన్నారు.

వరద ముప్పు!

- వర్షకాలం సమీపించినా పూర్తికాని నాలా పనులు
- 18 కిలోమీటర్ల మేర విస్తరణకు 28 శాతమే పూడికతీత
- జాప్యం చేసిన కాంట్రాక్టర్లకు మెమో జారీ చేసిన అధికారులు



అంబర్‌పేట్ నాలా

ప్రతి ఏడాది వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్య పరిష్కారానికి ఈ ఏడాది కూడా అదే నిర్లక్ష్యం కనబడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షంతో వచ్చే వరదలను నివారించేందుకు చేపట్టాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. కనీసం 50 శాతం మేర పనులు జరగలేదు.

అంబర్‌పేట: వరద ముంపును నివారించేందుకు నియోజకవర్గంలో నాలా పూడికతీత పనులను ప్రతి వేసవిలో చేపడతారు. వేసవి ప్రారంభంలో నాలాల పూడికతీత పనులు చేపట్టి వేసవి ముగిసేలోపు పూడికతీత పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా ఈ ఏడాది పూడికతీత పనులు వేసవి వచ్చినా ఇంకా పూర్తి కాలేదు. దీంతో నాలా పరివాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

18 కిలోమీటర్ల పరిధిలో..

- నియోజకవర్గంలో 18 కిలోమీటర్ల మేర పలు నాలాలు విస్తరించి ఉన్నాయి. మొయిన్ చెరువు నాలా, ఉస్మానియా యూనివర్సిటీ నాలా, ఉస్సేన్‌సాగర్ నాలాలు ఉన్నాయి. 18 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నాలా పూడికతీత పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 28 శాతం మాత్రమే నాలా పూడికతీత పనులు జరిగినట్లు సమాచారం.
- వేసవి ప్రారంభంలో పనులు ప్రారంభమైన నేటి వరకు కనీసం 50 శాతం పనులు దాటక పోవడంపై నాలా పరిసరాల్లో నివసించే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పర్యవేక్షణ లోపం?

వర్షాకాలంలో ప్రధాన సమస్యను అధిగమించేందుకు చేపట్టిన నాలా పూడికతీత పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడం గమనార్హం. యుద్ధ ప్రాతిపదికన నాలా పూడికతీత పనులను పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాలు...

- నియోజకవర్గంలోని మల్లికార్జున్‌నగర్, రహత్‌నగర్, బాపునగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, గంగానగర్, న్యూ గంగానగర్, శంకర్‌నగర్, ఛే నంబర్ చౌరస్తా, రత్నానగర్ తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ప్రతి వర్షాకాలంలో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య తీవ్రత తెలిసినా పూడికతీత పనుల్లో జాప్యం చేయడం దారుణమని పలువురు వాపోతున్నారు.

తూతూ మంత్రంగా..

ప్రతి ఏడాది నాలా పూడికతీత పనులంటే పెద్ద ప్రహసనంగా మారుతుంది. పనులు దక్కించుకోవడంపై కాంట్రాక్టర్లకు ఉన్న శ్రద్ధ పనులు నిర్వహించడంపై లేదనే విమర్శలున్నాయి. నాలా నీటిలో ఉన్న మట్టి ఇతర వస్తువులను నామమాత్రంగా తొలగించి పూర్తి చేసినట్లు చూపిస్తున్నారు. నాలాపూడికతీత పనుల్లో నాణ్యత లోపించడంతోనే సమస్య తలెత్తుతోంది.

కాంట్రాక్టర్లకు మెమో జారీ చేశాం..

నియోజకవర్గంలో 18 కిలోమీటర్ల నాలా విస్తరణలో ఇప్పటి వరకు 28 శాతం పనులు పూర్తయ్యాయి. జాప్యం చేసిన కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేశాం. ఇతర ఏజెన్సీలను సైతం రంగంలోకి దింపి నాలా పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేశాం. వర్షపు నీటి ముంపు ముప్పును నివారించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం.

–పే్రరాజు, ఈఈ జీహెచ్‌ఎంసీ సర్కిల్–16

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సంజీవయ్యనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్ బస్తీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం సంజీవయ్యనగర్‌లో ఆయా విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. లోప్రెషర్ నీటిసరఫరా, డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. కొత్త పైప్‌లైన్ వేయించాలని, చాలా చోట్ల విద్యుత్‌వైర్లు ప్రమాదకరంగా మారాయని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయించాలన్నారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికొచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులు, స్థానిక బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వీడియోను ప్రారంభిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: తెలంగాణ వైభవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా చాటి చెబుతామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం 6 నెంబర్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు సీనియర్ నాయకులతో కలిసి దశాబ్ది ఉత్సవాల డిజిటల్ ఆడియో, వీడియో రికార్డులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు, సీఎంగా కేసీఆర్ చేపట్టిన బాధ్యతలు, అభివృద్ధి అంశాలకు సంబంధించిన వీడియోలు, ఆడియోలతో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మాజీ కార్పొరేటర్ పులిజగన్, సీనియర్ నాయకులు రమేష్, విజితారెడ్డి, నగేష్‌గౌడ్, మరళీకృష్ణ, జీవన్‌గౌడ్, రాహుల్, జనార్దన్, దిలీప్ కుమార్, గౌస్‌పాషా తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్‌ను వార్డు ఆఫీస్‌కు కేటాయించొద్దని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ భవనాన్ని డివిజన్ వార్డు ఆఫీస్‌కు కేటాయించొద్దని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్‌తో కలిసి బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డీడీ రూపంలో డబ్బులు చెల్లించి డివిజన్‌లోని పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలకు ఉపయోగించుకునే కమ్యూనిటీహాల్ వార్డు ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. స్థానిక ప్రజల ఉపయోగం, సౌకర్యానికి అడ్డుపడవద్దనే జవహర్‌నగర్ ఎస్‌ఆర్‌టీటీ, టీఆర్‌టీ కాలనీల ప్రజల ఆవేదనను కమిషన్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. కమిషనర్ స్పందించి సంబంధింత అధికారులతో చర్చించి కమ్యూనిటీహాల్ కాకుండా మరోచోట వార్డు ఆఫీసు ఏర్పాటుకు సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం !



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: పొగాకు వాడకంతో అనర్థాలు తలెత్తుతాయని పొగాకు వాడకాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ ' ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం జస్టిస్ సూర్యపల్లి నంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు. షాపిడ్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మీరా, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణముదిరాజ్, రాష్ట్ర కన్వీనర్ కాకి సదానందస్వామి, కాశిమోని శ్యామ్‌రావు, రాధారి రామ్మోహన్, ప్రేమ్‌చంద్, ఉర్మిదాస్, మంజుల, శివకుమార్, రాజేందర్‌ముదిరాజ్ తదితరులున్నారు.

'పేదలపై దయలేని పార్టీలను పాతర వేయాలి'



సమావేశంలో పాల్గొన్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద వర్గాలపై దయలేని రాజకీయ పార్టీలను పాతర వేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం బీసీ రాజ్యాధికార సమితి యువనాయకులు గాజు యుగేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రూప్–1 తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీయువకులకు ఉచిత భోజన సౌకర్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దాసుసురేష్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సొంత ఊరు, కన్నవారిని వదులుకుని ఉన్నత ఆశయం కోసం వచ్చిన విద్యార్థులకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. వారు లక్ష్యాన్ని సాధించే వరకు సామాజిక బాధ్యతగా అభ్యర్థులకు రెండు పూటల భోజనం, స్టడీ మెటీరియల్స్, కెరీర్ గైడెన్స్, మెడికల్ కేర్, హాస్టల్ వసతిని సైతం అందించనున్నట్లు పేర్కొన్నారు. పాలక పక్ష పార్టీ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు శంకర్, ఊర్మిల, భాగ్యలక్ష్మి, దాసు బలరాం, మంద వెంకటస్వామి, సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం ఏర్పాటును ఉపసంహరించుకోవడంపై హర్షం



ఎస్సార్టీ, టీఆర్‌టీ రెసిడెన్షియల్ అసోసియేషన్, పలు పార్టీల నేతలు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ వార్డు కార్యాలయం ఏర్పాటును ఉపసంహరించుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్న గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను యధావిధిగా కొనసాగిస్తూ.. అధికారులకు నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఎస్సార్టీ, టీఆర్‌టీ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాయకులు, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస, పీఎస్ శ్రీనివాస్, సురేందర్, శ్రీధర్‌రెడ్డి, రవి శంకర్‌గుప్తా, శ్రీనివాస్, సాయిలు, పున్న సత్యనారాయణ, మధుకర్, దేవయ్య, పరుశురాం, మహేందర్, శ్రీహరి, సురేందర్, శ్రీకాంత్, సురేందర్, సతీశ్‌లు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తెలియజేసి దశాబ్ది ఉత్సావాలను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు కోరారు. బుధవారం రాంనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శ్రీనివాస్, సయ్యద్ అస్లాం, బుజ్జి వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి



కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు చొరవ తీసుకుంటానని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం డివిజన్‌లోని పారిశుద్ధ్య సమస్యపై ఏఎంఓహెచ్‌ఓ జ్యోతిబాయి, పారిశుద్ధ్య సిబ్బందితో సామూహిక పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించారు. శంకర్‌నగర్, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన మట్టికుప్పలు, పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. పారిశుద్ధ్య సమస్యపై నిర్లక్ష్యం చేయకూడదని ఆమె జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ బజరంగ్ సేన కార్యదర్శిగా వికాస్‌సింగ్

కాచిగూడ: తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఠాగూర్ వికాస్‌సింగ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాచిగూడలోని బజరంగ్‌సేన రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌ఆర్ లక్ష్మణ్‌రావు, మహిళా అధ్యక్షురాలు రజని పాల్గొని ఠాగూర్ వికాస్‌సింగ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీనివాస్‌గుప్తా, మనోజ్ మోగల్‌గిద్ది, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'మన టీఆర్‌ఎస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శరత్‌బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన తెలంగాణ రాష్ట్ర సమితి (మన టీఆర్‌ఎస్) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శరత్‌బాబును ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు టైగర్ పోతు అశోక్ నియమించారు. బుధవా రం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో వరంగల్‌కు చెందిన డాక్టర్ శరత్ బాబు 100 మంది కార్యకర్తలతో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు ఇంటర్నేషనల్ మదర్ థెరిస్సా అవార్డు, జాతీయ గ్లోబల్ అవార్డులను అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకులు మౌనిక, సంతోష్‌కుమార్, అంకం శ్రీనివాస్, స్వామిగౌడ్, ఏ.నాగిరెడ్డి తదితరులున్నారు.

క్యూనెట్ నిందితుల అరెస్ట్‌పై హర్షం



కవాడిగూడ: 'క్యూనెట్ కేసులో ముగ్గురు వ్యక్తులను సెంట్రల్ క్రైమ్‌స్టేషన్ పోలీసులు వేగంగా స్పందించి అరెస్టు చేయడంపై ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు, క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు'. క్యూనెట్ పేరుతో కాకుండా మరో పేరుతో తిరిగి నిరుద్యోగులను దో చుకుంటున్న వారిని సీసీఎస్ పోలీసులు గుర్తించి 35 బ్యాంక్ ఖాతాలలో రూ.54 కోట్లు స్తంభింపజేయడం అభి నందనీయమన్నారు. గత వా రం క్యూనెట్ బా ధితుల జేఏసీ సిసిఎస్‌లో ఫిర్యా దు చేసి, నిందితుల పై కఠిన చర్యలు తీసుకుని, బాధితుల సొమ్మును తిరిగి ఇప్పించాలని కోరామన్నారు. వీలైనంత త్వర గా బాధితుల డబ్బులను వారికి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఏ.ఎల్.మల్లయ్య సేవలు మరువలేనివి

కవాడిగూడ: గంగపుత్ర, బెస్త, గూండ్ల కులస్తుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ దివంగత తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ చైర్మన్ ఏ.ఎల్.మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని సంఘం అధ్యకులు శ్రీహరి అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం రాష్ట్రంలో ఉన్న గంగపుత్రులంతా ఉద్యమించి హక్కులు సాధించుకున్నప్పుడే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఏ.ఎల్.మల్లయ్య 86వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ–ఏ కులాల హక్కుల రక్షణ కమిటీ వైస్ చైర్మన్, రిటైర్డ్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ భాగయ్యను తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరిలు ఏ.ఎల్.మల్లయ్య మెమోంటో అందజేసి ఘనంగా సత్కరించారు. శివరత్నం, ఎల్లబోయిన మల్లేష్, చంద్రప్రకాష్, అంబటి సుధాకర్, బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి నరహరి, అంబటి సంతోష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో వాహనాలకు చలాన్లు మానుకోవాలి

కాచిగూడ: దేవాలయాల దగ్గర దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలకు చలాన్లు వేయడం మానుకోవాలని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌కు విన్నవించారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో దేవాలయ దర్శనానికి వస్తున్న భక్తుల వాహనాల(బైక్, కార్లు)కు ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేస్తున్నారని ఆరోపించారు. తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం వంటి ప్రముఖ దేవాలయాల వద్ద కూడా పోలీసులు భక్తులను చలాన్ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఆలయాలకు వెళ్లాలంటే భక్తులు భయపడే ప్రమాదం నెలకొందన్నారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని వీహెచ్‌పీ డిమాండ్ చేస్తుందన్నారు.

డాక్టర్ కె.లక్ష్మణ్‌కు సన్మానం



డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న భరత్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంపీగా ఏడాది పూర్తి చేసుకున్న డాక్టర్ కె.లక్ష్మణ్‌ను చిక్కడపల్లిలో బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షులు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా పేదలు, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలోని నలుమూలల పనిచేసే అవకాశం కలిగిందన్నారు. బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సీ.కె.శంకర్, రమేష్ రామ్, శైలేంద్ర శ్రీనివాస్‌యాదవ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామకం

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తుమ్మరడ శ్రీనివాస్‌రావును నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య బుధవారం కాచిగూడలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి బీసీ సంక్షేమ సంఘం, ఆర్.కృష్ణయ్యకు మంచిపేరు తీసుకొస్తానన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, డాక్టర్ ఎస్.మారేష్, రామకృష్ణ, నందగోపాల్, అంజి, సుశీల తదితరులున్నారు.



శ్రీనివాస్‌రావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



సుందరయ్య పార్కు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయడంతో పాటు అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. దేశానికి పతకాలు సాధించిన మహిళా క్రీడాకారుల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాత నామమాత్రంగా కేసునమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నిందితుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతోనే అతడిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, సోమశేఖర్, వెంకట్, రాజశేఖర్‌రెడ్డి, శాంతాకుమారి తదితరులున్నారు.

రైల్లో ప్రయాణికురాలి నగదు, నగల బ్రీఫ్‌కేసు చోరీ..

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ నగలు, నగదు ఉన్న బ్రీఫ్‌కేస్ చోరికి గురైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగిని హారిక మంగళవారం విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తుంది. కాగా బుధవారం తెల్లవారుజామున రైలు బొమ్మాయిపల్లి వద్ద ఉండగా 2 తులాల నల్లపూసల గొలుసు, ఆర తులం ఉంగరం , రూ.10వేల నగదు, ఐదు ఏటిఎం కార్డులు, బట్టలు ఉన్న బ్రీఫ్‌కేస్ చోరీకి గురైంది. దీంతో బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం నల్గొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

- రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (40) బుధవారం ఉదయం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఏజీ రామారావు (ఫైల్)

నల్లకుంట: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. ఏజీ రామారావు (64) కుటుంబసభ్యులతో కలిసి విద్యానగర్ స్ట్రీట్ నంబర్ 8లోని ఓ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మే 30న ఉదయం 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులను విచారించినా.. ఆచూకీ లభించలేదు. దీంతో కుమార్తె నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.